# దీపకం

ప్రసాదరావు ఇంట్లో అడుగు ఫెడుతోనే 'మీనాన్న దగ్గర్నించీ వుత్తరం వచ్చింది' అన్నాడు. జానకి సహజోత్సాహంతో దగ్గరికొచ్చింది. ప్రసాదరావు యింకేం మాట్లాడకుండా నింపాదిగా దుస్తులు మార్చుకుని కుర్చీలో జారగిల బడ్డాడు.

''ఉత్తరం ఏదండీ?''

''జేబులో వుంటుంది చూడు----'' ఎంతో నిర్లక్ష్యంగా వచ్చింది జవాబు. జానకి వుత్తరం తీసుకు చూచుకుంది. చదువుకుని మనసులో సంతోషపడింది. ఆశగా భర్తవంక చూచంది. ప్రసాదరావు మాత్రం అన్నింటికీ అతీతుడుగా పోజు పెట్టాడు.

జానకి వుత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చూచుకుంది. ప్రసాదరావు మాట్లాడుతాడేమోనని చూచింది. చూపుల్తోనే పలకరించింది. కాని ప్రసాదరావు వులకలేదు, పలకలేదు. ఇంకో సన్నివేశంలో అయితే ఆవిడకూడా నోరు మెదపకండా అవతలకు వెళ్ళిపోయుండేదే కాని ----ప్రస్తుత పరిస్థితిలో ఆ పని సాధ్యంకాలేదు. ఆమె వుత్సాహం వురకలు వేస్తోంది. చివరకు ప్రసాదరావు మాట్లాడడని రూఢయినాక, ''ఏమండీ, మాట్లాడకుండా కూచుంటారేం?'' అనడిగింది. అంతకంటే యేమనాలో ఆమెకి తోచిందికాదు మరి!

ప్రసాదరావు అప్పటికి మాటాళ్ళేదు. జానకి అంత సంతోషంలోనూ కాస్త అయోమయంలో పడింది. ముఖకవళికలు కొద్దిగా మారాయి, భర్తకి మరీ దగ్గరగావచ్చి కూర్చుంది. ''మీరు వుత్తరం చదవలేదా యేమిటి, యిరవైఅయిదో తారీఖు మా అన్నయ్య పెళ్ళిట----'' అంది. ఈ మాటలు కేవలం తనని కవ్వించటానికే అన్నదని ప్రసాదరావుకు తెలుసు. ఉత్తరం భద్రపరిచి జేబులో పెట్టుకు తెచ్చీ----చదవనినాడు ఎంత తెలివి తక్కువ మనిషి! ప్రసాదరావు ప్రయత్నపూర్వకంగా నవ్వాడు. కేవలం జానకి పరిస్థితికి సానుభూతి సూచకంగా నవ్వాడు అంతే. నవ్వి వూరుకున్నాడు. ఈ నవ్వుతో జానకి కాస్త తమాయించుకుంది. మళ్ళీ మామూలుగా తయారై ''యిరవై అయిదో తేదీనే పెళ్ళిట.

ఎప్పుడు బయల్దేరుదామంటారు?---- వ్యవధి యిరవైరోజులే వుంది----'' అంది. ప్రసాదరావు జానకికి ఆలోచించడానికి టైం యిచ్చి ''ఎక్కడికి బయల్దేరటం?'' అని ప్రశ్నించాడు----బొత్తిగా అర్థంలేని ప్రశ్న.

''పెళ్ళికి.''

''ప్రయాణం లేదు, గియాణంలేదు'' అన్నాడు ప్రసాదరావు.

''అబ్బ, అన్నీ నిశ్చయమై ముహూర్తం యింకా యిరవై రోజుల్లోనే వున్నా మీకు హేళనే! చెప్పండీ ఎప్పుడు ప్రయాణమోను!''

''హేళనేముందీ----ప్రయాణం లేదు-'' నిజానికి యీ మాటల్లో హేళన లేదు. కాస్త అర్థమయేట్లు చెబుదురూ అని జానకి బ్రతిమిలాడింది. ప్రసాదరావు అతి బలవంతంమీద ''నిన్ను మీ అన్నయ్య పెళ్ళికి పంపించనని యిదవరకే చెప్పాగా'' అన్నాడు.

జానకికి యీ పరిహాసంతో నవ్వు వచ్చింది. ''మొత్తానికి బలేవారండీ. మా అన్నయ్య పెళ్ళి విషయంలో మొదట్నించీ కూడా మీ వైఖరి యిలానే వుంది కాని యిప్పుడూ యిదే మాటా?''

''ఎప్పుడూ ఒకటే మాట'' హరిశ్చంద్రుడిని చంపి పుట్టుకొచ్చానన్నట్టు అన్నాడు ప్రసాదరావు.

''ఇంతకీ ప్రయాణం లేదంటారు'' యింకా నవ్వుతోనే అడిగింది జానకి.

''లేదనేగా మొదట్నించీ చెప్పటం''

''అబ్బ, నన్నూరికే యేడిపించక నిజం చెప్పండి'' గాద్గదికంగా మారింది గొంతు. ప్రసాదరావు యిందాకటిలానే నవ్వాడు. కాని యీ నవ్వు జానకి కేమీ రిలీఫ్ యివ్వలేదు. ఎట్లాగయినా అతన్ని మాటల్లోకి దింపాలనే ప్రయత్నంతో ''[illegible]ట్లా అబద్ధాలు చెబుతారు కాని యీ పాటికి సెలవుచీటీ రాసిచ్చేసి, మంజూరు చేయించుకునే వుంటారు! ఊరికే నన్ను భయపెట్టటానికి యీ యెత్తు. నేనేమంత తెలియని దాన్ని కాదులెండి. మీరెంతో మంచివారు కదూ-'' అంది. అన్న నాలుగు మాటలూ మన స్ఫూర్తిగానే అంది----ఎందుకనదు? కాపురానికి కొచ్చిన నెలలోనే తను కోరితే రవ్వల నెక్లెస్ చేయించాడు, కొత్తరకం గాజుల జత కొన్నాడు. తను వద్దంటున్నా రోజూ మల్లెపూలు తెస్తున్నాడు---- ఎంతో సుఖపెడుతున్నాడు తనని. ఆయన మంచితనం తనకు పూర్తిగా

తెలుసు. అంత మంచివాడు యీ ప్రపంచంలో వుంటాడంటే తను నమ్మి వుండేదికాదు పూర్వం.

"మంచి నాటకమే ఆడుతున్నారు కాని ----నాకో మంచి సిల్కుచీర కొనాలి!"

"తప్పకుండా కొంటాను" అన్నాడు వెంటనే ప్రసాదరావు. జానకి సంతోషం మరింతయింది. పూర్వజన్మ సుకృతంవల్ల తనకు దేవుడిలాంటి భర్త దొరికాడు. అతని గాంభీర్యాన్ని జానకి లోలోన నవ్వుకుని ఆనందించింది.

మర్నాడు ప్రసాదరావు ఆఫీసుకు వెడుతోండగా జానకి అడిగింది "మరి మా నాన్నగారికి జవాబు రాసిపడేయరూ?"

"నువ్వే రాయి."

"ఏమని రాయమంటారు?" ప్రసాదరావు నవ్వుకున్నాడు.

"ఎప్పుడొస్తున్నామని రాయమంటారు!"

"ప్రయాణం లేదన్నానుగా!" ప్రసాదరావు. భార్య ముఖం చూడకుండా జాగర్తపడే అన్నాడు.

"మళ్ళీ మొదలెట్టారూ 'అదే పాట' నన్నూరెక్కే యేడిపించక జవాబు చెప్పండీ----"

"అయితే నీ యిష్టం వచ్చినట్టు వ్రాయి----" నవ్వుతోనే ప్రసాదరావు వెళ్ళిపోయాడు.

అతనింత గాంభీర్యం ఎందుకు ప్రదర్శిస్తున్నాడో జానక్కి అర్థం కాలేదు. ఆ మాటకు, శోభనంనాటి రాత్రే అన్నాడు తనని అన్న పెళ్ళికి పంపనని! "మీ దయ" అని వూరుకుంది. ఆ తరవాత అప్పుడప్పుడూ ఆ ప్రసంగం వచ్చినప్పుడల్లా చిలకపలుకులా ఆ మాటే అంటున్నాడు. తీరా యివాళ వుత్తరంవచ్చి, ప్రయాణం అవాల్సిన టైముకి కూడా యిదే పాటా! కొంపతీసి అంత పనీ చెయ్యడు కద!

అబ్బే, తనెందు కామాట అనుకోవాలి? అంత మంచివాడిని గురించి తన కా దుర్భావన ఎందుకు రావాలి? తనని పరీక్ష చెయ్యటానికే ఆయనిట్లా చేస్తున్నారు. అంతకంటే మరేం లేదు.

జానకికి భర్తలో యీ మాత్రం విశ్వాసం వుంది; ఉన్నది కనకనే యిల్లా ధైర్యం తెచ్చుకో గలిగింది.

అసలు యీ పెళ్ళి తను కాపురానికి రాక ముందే జరిగుండాల్సింది. కాని ఎందుచేతో ముడి పడింది కాదు----కారణాలు తనకి అస్పష్టంగానే తెలుసు, కాపరానికి వచ్చిన మొదట్రోజుల్లో----యింకా నిండా ఆర్నెల్లేనా కాలేదు----యీ పెళ్ళిని గురించీ, ఏర్పాట్లని గురించీ భర్తకి ఎంతో ఉత్సాహంతో చెబుతూండేది అంత ఉత్సాహంతోనూ వింటూనే "నిన్ను మీ అన్నయ్య పెళ్ళికి పంపను-" అంటూండేవాడు, తను నవ్వి వూరుకునేది----అంతే!

నాలుగురోజులు గడిచాయి, ప్రసాదరావు మామగారికి ఉత్తరం వ్రాయలేదు; జానకి రాయలేదు. ఏ క్షణాన్నయినా సరే ప్రయాణానికి సిద్ధమయే కూర్చుంది. ప్రసాదరావు మాత్రం ఈ విషయమే ప్రస్తావనకి తేడు. ఒకవేళ భార్య తెచ్చినా అదే పాట పాడతాడు. జానకి మాత్రం భర్తలోనే విశ్వాసంవుంచి రోజు ల్లెక్కెడుతోంది; అంతకంటే యేం చేస్తుంది పాపం, బొత్తుగా యింగ్లీషు చదువుకోని పిల్ల!

ఇంతలో పెళ్ళికొడుకే స్వయంగా వచ్చాడు. చెల్లెల్ని తీసుకకెళ్ళటానికని! మామగారు తన వుత్తరం మీద కూతురూ అల్లుడూ యిదుగో వస్తారు, అదుగో వస్తారు, అని అయిదురోజులు అతి కష్టం మీద గడిపారని విని, ప్రసాదరావు నవ్వుకున్నాడు. తమనిద్దర్నీ తీసుకెళ్ళాలంటూ వచ్చిన బావమరిదితో ఏం చెప్పాలో, ఎట్లా చెప్పాలో అన్న ఆలోచనలో పడ్డాడు. బావమరిది ఆ కాస్త మాటా అడగనే అడిగేశాడు. ఆఫీసుకు సెలవు పెట్టేశెయ్ బావా, యివాళ రాత్రే ఎక్స్‌ప్రెస్‌కి వెడదాం----అన్నాడు. ప్రసాదరావు ఎంతో బాధపడుతున్నట్టు, నెససరీ యీవిల్‌కి ఆహుతవుతున్నట్లు ముఖం పెట్టి "కుదరదు లేవోయ్----మరేం అనుకోవద్దని మీ నాన్నగారితో చెప్పు" అన్నాడు. జానకి మాత్రం ప్రసాదరావు చేస్తున్న అభినయానికి మనసులో నవ్వుకుంది. బావగారు బెట్టుచేస్తున్నారనుకున్నాడు గావును---- పెళ్ళికొడుకు "అట్టాగంటే ఎట్లాగండీ? మిమ్మల్ని తీసుకురాకపోతే మా అమ్మా నాన్న నన్ను యింటి గుమ్మం తొక్కనిస్తారా? మరేం మొహమాట పడకండి" అంటూ బతిమాలే ధోరణిలో మొదలెట్టాడు. కాని ప్రసాదరావు మాత్రం ఏమీ దిగలేదు. తన మాటమీదే నించున్నాడు. రాత్రి ఎక్స్‌ప్రెస్ ఒక్క పెళ్ళికొడుకునే ఊరికి తీసుకెళ్ళింది.

17)



ప్రసాదరావు యింత బెట్టు చేస్తాడని జానకి భావించలేదు. చెయ్యాల్సిన అవసరం కూడా ఆమెకు కనిపించలేదు. ప్రసాదరావు తన మాట నిలబెట్టుకుంటున్నప్పటికీ జానకికి అతనిలో వుంచిన విశ్వాసాన్ని విత్‌డ్రా చేసుకోవాల్సిన అవసరం కనిపించలేదు కాని అతని చమత్కారానికీ, నాటకానికీ మాత్రమే ఆమెకి మహా విచిత్ర మనిపిస్తోంది. పెళ్ళికి ఎలానూ పంపిస్తారు. పంపించటమేమిటి తను కూడా వస్తారు. కాని యీ బెట్టుసరేమిటి? ఇంత బతిమాలించుకుందామన్న అభిలాషేమిటి? ఏమయినా తనకి మాత్రం ఆయన్లో పూర్తి విశ్వాసం వుంది. ఉన్నది కనకనే పెళ్ళికి పంపమని తను ప్రత్యేకంగా బ్రతిమాలక్కర్లేదు. ఎట్లానూ తామిద్దరూ పెళ్ళికి వెళ్ళటం రూఢే!

జానకి అనుకున్నట్టుగానే అన్న వెళ్ళిన మర్నాడే తండ్రి వచ్చాడు. మధ్యాహ్నం మూడు గంటలయింది. ప్రసాదరావు యింట్లో లేడు. కూతురితో అన్ని సంగతులూ మాట్లాడాక ఆయన "అట్లా అల్లుడి ఆఫీసుకు వెళ్ళొస్తానమ్మా. సెలవూ అదీ పెట్టించి తీసుకొస్తాను" అంటూ లేచాడు.

"ఈ ఎండలో ఏం వెడతావులే నాన్నా, యింకో గంటలో ఆయనే వస్తారుగా"

"సెలవూ అదీ చూచుకోమని చెప్పాలిగా పిల్లా"

"ఎంచేతో వూరికే బెట్టుచేస్తున్నారుగాని యీ పాటికి సెలవు మంజూరే చేయించుకునుంటారు నాన్నా. నువ్వూరికే కంగారు పడకు, కాస్సేపు నిద్రపో ఆయనొచ్చాక లేపుతాను----"

కూతురు యింత ఎస్యూరెన్స్ యిచ్చింతర్వాత ఆయనేమీ మాట్లాడలేకపోయారు; బాగా ప్రయాణ బడలికమీద వున్నారేమో పడుకున్న రెండు నిమిషాలకే సుఖంగా నిద్రపట్టింది. జానకి ఒంటరిగా కూచుని ప్రసాదరావు వచ్చింతర్వాత యేం జరుగుతుందో తన వూహ ప్రకారం అంచనా వేసుకుంటూ నవ్వుకుంటూండగనే అతనొచ్చాడు. భార్య నోటిమీదుగా మామగారొచ్చారని విన్నాక "అనవసరంగా అంతదూరంనించీ ఎందుకొచ్చినట్టు" అన్నాడు. ఈ మాటకి జానకికి కొంచెం ఆశ్చర్యం కలిగింది. భర్త యింకా వేళాకోళపు సరళిలోనే ఉన్నాడు!

ఆలస్యం చేస్తే అమృతం విషం అయిపోతుందన్న భయమో యేమో---- జానకి భర్తకి తెలీకుండా తండ్రిగారి బంగారంలాంటి నిద్ర కాస్తా పాడుచేసింది. ఆయన అల్లుడు

గారిని కుశల ప్రశ్నలూ అవీ వేస్తోనే అసలు విషయంలోకి దింపారు. "అబ్బాయి ఒక్కడూ వొచ్చి యిట్లా జరిగిందంటే నేన్నిజంగా నమ్మలేక పోయినాను. కుర్రనాగమ్మ సరీగా అదిగాడోలేదోనని భయమేసి నేనే పరిగెత్తుకు చక్కా వచ్చాను. వాడికి సరీగా మాట్లాడటం కుదిరుండకపోవచ్చును, యింకో విధంగా అనుకోకు నాయనా!----యివాళే బండికి బయలుల్దేరుదాం----"

ప్రసాదరావు సగం సగం మాట్లాడుతోనే తాను పెళ్ళికి రావటం పడదనీ, కనీసం జానకినైనా పంపటం కుదరదనీ ఖచ్చితంగా చెప్పేశాడు. ఈ మాటతో ముసలాయనకే కాకుండా జానకికి కూడా పుట్టెడు ఖేదం ముంచుకొచ్చినట్లయింది. ఈ పరిస్థితికి అది యేమిటో, అంతం యేమిటో వాళ్ళిద్దరికీ అర్థం కాలేదు. ఇంత నిష్కర్షగా సంభాషణ జరిగింతర్వాత కూడా జానకి తండ్రి లక్ష ప్రశ్నలు వేశాడు. కాని ఏ కారణంవల్ల అల్లుడు యిట్లా మాట్లాడుతున్నాడో ఆయనకు సుతరామూ అర్థంకాలేదు. జానకికే అర్థంకానప్పుడు యిందలో ఆశ్చర్యం యేముంది?

మొత్తానికి ఆయన కూడా ఒంటరిగా తిరిగి పోవలసి వచ్చింది. అట్లా వెడుతూ కూడా అల్లుడితో సవినయంగా మనవి చేసుకున్నాడు ఎట్లానైనా సరే బాగా ఆలోచించుకుని పెళ్ళినాటికి రెండు రోజులు ముందుగానే అక్కడికి రమ్మని. ప్రసాదరావు ఏమీ మాటాడ్లేదు. ఆ మౌనానికి అర్థం యేమిటో తెలీక మామగారు తికమక పడుతున్నాడు. జానకి మాత్రం చొరవ చేసుకుని "నువ్వేం బెంగ పెట్టుకోకు నాన్నా, మే మిద్దరం ఎలాగూ ఆరోజుకి వస్తాం, మరేం అనుకోకు, ఆయన చాలా మంచివారు, మీకు తెలుసుగా" అంది. ప్రసాదరావు మట్టుకు స్టేషన్ దాకా మామగారిని సాగనంపుతో "పెళ్ళికి రానందుకు ఏమీ అనుకోవద్దనీ ఈ శుభకార్యం సలక్షణంగా ముగిసినట్లు ఉత్తరం రాయమనీ" అనేకసార్లు చెప్పాడు. అసలే యేడుస్తున్న తనని యింకా ఎందుకు యేడిపిస్తాడో ఆయనకి అర్థం కాలేదు.

పెళ్ళి నాలుగు రోజుల్లో పడింది. ప్రసాదరావులో మటుకు యేమీ చైతన్యం రాలేదు. జానకికి తను తండ్రి కిచ్చిన మాట నెరవేరుతుందనే ఆశ సన్నగిల్లింది. భర్త కాళ్ళదగ్గర కూచుని "ఏమండీ, నిజం చెప్పండి - ఏమిటి మీ వుద్దేశ్యం-" అనడిగింది. "నేను మొదట్నుంచీ చెబుతూనే వున్నాగా" అన్నాడు ప్రసాదరావు.

"ఎందుకు నాకీ శిక్ష? ఎందుకోసం నన్నిట్లా యేడిపిస్తారు? ఏమిటి మీమనసులో కోపం? నావల్ల జరిగిన అపరాధం యేమిటి? మావాళ్లు మీకు చేసిన లోటేమిటి?" అంటూ జానకి యేడ్చే ధైర్యం కూడా లేకుండా భర్తని గారాబంగా దీనంగా అడిగింది.

ప్రసాదరావు ఏమీ సమాధానం చెప్పడు! "అంతగా వెళ్లాలనుంటే నువ్వు వెళ్ళు పంపిస్తాను. కాని నిన్ను పంపటం కూడా నాకిష్టం లేదు. నీ కంతగా వెళ్ళాలనుంటే వెళ్లు" అన్నాడు చివరికి. జానకి నీరసంగా అంది! "మీ యిష్టానికి వ్యతిరేకంగా నే వెళ్ళను. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. యిద్దరం వెడదాం పదండి---- మా వాళ్లు ఎంతో సంతోషిస్తారు----"

ప్రసాదరావు మాత్రం మరో మెట్టు కిందికి దిగలేదు. "ఈ ముసలితనంతో నన్నిట్లా క్షోభ పెట్టకు నాయనా" అంటున్న మామగారి ముఖం అతనికి జానకి శోక వదనంలో కనిపించింది. కాని చలనంమటుకు కలగలేదు. భర్తని కన్విన్స్ చెయ్యటానికి జానకి యింకా ప్రయత్నించింది. ప్రసాదరావు "వెడితే నిన్ను వెళ్ళమన్నాను గా, యింకా యీ విషయంలో పట్టుపట్టి నన్ను క్షోభపెట్టకు" అన్నాడు.

భర్తని క్షోభ పెట్టటం యిష్టంలేక యిక నామె ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. మనసులో మటుకు ముహూర్తాన్నే స్మరించుకుంటూ మసలుతోంది. సరీగా పెళ్ళినాటి రాత్రి. సరిగా సుముహూర్తం టైముకు జానకికి వరుడూ వధువూ కనిపించారు. పెళ్ళి పందిరంతా ఆమె మనఃఫలకంలో ఒక్కసారి మెదిలి మాయమైపోయింది.

కాని ఆమెకిదంతా ప్రశ్నగానే మిగిలిపోయింది: ఎంతో మంచివాడైన భర్త యీ ఒక్క విషయంలో ఎందుకిట్లా ప్రవర్తించాడు? మొదట్నించీ వేళాకోళంగానే తను భావిస్తున్న ఆ మాట యథార్థమే ఎందుకయింది?-----ప్రసాదరావు యీ ప్రశ్నలకు సమాధానం చెప్పడు. జానకి అతన్ని అడిగి క్షోభపెట్టదు. ❋

(ఆంధ్ర ప్రభ సచిత్ర-వార పత్రిక)